# వినాయక చవితి 'కాలమ్' దాటని కథల పోటీలో ఎన్నికైన కథలు

## జయవిజయుడు

అదొక విశాలమైన గది. ఆ గదిలో ప్రఖ్యాత లాయర్లు షేర్‌ఖాన్, ఎస్.ఆర్. జైన్, రాజేంద్ర సమావేశమై లాయర్ల నైతిక విలువల మీద చర్చించుకుంటున్నారు. వారికి ఎదురుగా టేబుల్ మీద గాంధీగారి బొమ్మ, మూడు కోతుల బొమ్మ వున్నాయి.

"అసలు కేసులో న్యాయం లేదనిపించినప్పుడు వాడు ఎంత ఇస్తానన్నా సరే వినకుండా ఆ కేసు వదులుకుంటా" అన్నాడు షేర్‌ఖాన్.

"సెక్రటరీ చేత కేసు విని కేసులో న్యాయం ప్రతివాదిది అనిపిస్తే క్లయింట్ ముఖం కూడా చూడకుండా నేను తిరస్కరిస్తాను" అన్నాడు ఎస్.ఆర్. జైన్.

అసలు క్లయింట్ ముఖం చూడగానే కేసు ఎలాంటిదో తనకు తెలుస్తుందని, అది అబద్ధం, కేసు అయితే కనీసం మాట్లాడకుండానే చేత్తోనే తిరస్కరించి పంపుతానని చెప్పాడు ప్రఖ్యాత లాయరు రాజేంద్ర.

"ఏం లాభం? కొందరు లాయర్లు పేరు గురించి, డబ్బు గురించి అడ్డమైన కేసుల్ని పట్టి అడ్డదారులు తొక్కుతుంటే మన నీతి ఎవడిక్కావాలి" అన్నాడు షేర్‌ఖాన్.

"అసలు ఈ అడ్డదారులు ముందు నుంచి వున్నాయండి. మా దేవుడు విష్ణుమూర్తి వద్ద జయవిజయులు అనే ద్వారపాలకులు వుండేవారు. వారి మీద మునీశ్వరులకు కోపం వచ్చి 'మీకు ఈ ఉద్యోగం ఊడిపోయి విష్ణుమూర్తికి దూరముగుదురుగాక' అని శపిస్తారు. ఆ సంగతి విష్ణుమూర్తికి విన్నవించుకుని కనికరించమంటారు జయవిజయులు. సరే "ఈ ఉద్యోగం మీకు తిరిగి రావాలంటే ఏడుసార్లు మంచివారుగా, నా భక్తులుగా భూలోకంలో జన్మిస్తారా? లేక మూడుసార్లు చెడ్డవారుగా, నా శత్రువులుగా జన్మిస్తారా?" తేల్చుకోమని వారికి ఒక అవకాశం ఇచ్చాడు.

"వారు వారి స్వార్థం గురించి మూడు జన్మల అడ్డదారినే ఎన్నుకున్నారు. దాని వలన ఎంత జన నష్టం ఎంత మంది బాధపడ్డారో మీకు తెలుసు కదా?" అన్నాడు రాజేంద్ర.

అంతలో షేర్‌ఖాన్ సెక్రటరీ వచ్చి ఎవరో వచ్చారని చెబితే పంపించమన్నాడు. నలుగురు గెడ్డాలు, తలపాగాలతో వున్న వ్యక్తులు పెద్ద ట్రంకు పెట్టె పట్టుకొని లోపలికి వచ్చారు.

"ఏమిటి సంగతి?" అని అడిగాడు షేర్‌ఖాన్.

"మీకు తెలుసు కదా! మా వూరి మునసబుగారిని ఆయన అంగరక్షకులే చంపారు" అని చెప్పి ఆపాడు ఒకడు.

"ఆ సంగతి తెలియని వాళ్ళెవరుంటారు. వాళ్ళలో ఒకడు చావగా మిగిలిన వాడిప్పుడు జైల్లో వున్నాడు కదా! అయితే ఏమిటి?"

"ఎస్. వాడు నిర్దోషి అని మీరు వాదించాలి. మీరు ఎంత కావాలన్నా ఇస్తాం" ఇదిగో పెట్టెలోని-

"ఆపు! నువ్వు ఇంకేమీ చెప్పనక్కరలేదు. నేను వినను" అని చెవులు మూసుకున్నాడు షేర్‌ఖాన్.

"పోనీ, మీరు" అని ఎస్.ఆర్. జైన్‌ని ప్రశ్నించి పెట్టె మూత తీసి డబ్బు చూపించబోయారు.

"అక్కర్లేదు-వాడు నిర్దోషి అని వాదించి నేను ఆత్మవంచన చేసుకోలేను. నాకు ఆ డబ్బు చూపించనక్కరలేదు" అని కళ్ళు మూసుకున్నాడు జైన్.

"మీరూ" అని రాజేంద్రని అడగబోయి తమాయించుకున్నారు. అతను ఆ చనిపోయిన మహా నాయకుడి చేత మతతత్వ పార్టీగా ముద్రపడిన ఒక పార్టీకి నాయకుడు. వాళ్ళే కాదంటే అతనెలా వాదిస్తాడని వెనక్కి తిరగబోయారు.

"ఆగండి నేను వాదిస్తాను. ఆ పెట్టె అక్కడ వుంచి రేపు నా ఆఫీసుకు వచ్చి కలవండి" అన్నాడు రాజేంద్ర. పెట్టె వదలి వాళ్ళు వెళ్ళిపోయారు.

'ఛీ-డబ్బుకు నేను గడ్డి తింటాను కాని, శవాల్ని తినమురా కుక్క' అనుకున్నాడు షేర్‌ఖాన్.

'అమ్మ వెధవా-జయవిజయుల కథలో నీతి ఇలా ఉపయోగించావా!'అని ఆశ్చర్యపోయి చూశాడు జైన్.

తనకు ఇవేమీ పట్టనట్టుగా, 'ఈ కేసుని ఎలా మలుపులు తిప్పి సాగదీసి ఇంకా డబ్బు ఎలా పిండాలా?' అని ఆలోచిస్తున్నాడు రాజేంద్ర.

ముదిలి కాశీ అన్నపూర్ణ

1

## నవ్వు ఖరీదు!

"నవ్వు ఖరీదు నలభై రూపాయిలు... మీకా కథ తెలుసా?" అడిగేడు అచారి... సహచరుల్లో సస్పెన్స్ రేపుతూ.

"చెప్పండి... చెప్పండి!" అంటూ చుట్టూ మూగేరు తోటి వాళ్లంతా.

"అయితే వినండి!" అంటూ చెప్పటం ప్రారంభించాడు... వాళ్ళ కుతూహలాన్ని కనిపెట్టి.

"సుందరం ఓ ఆఫీసులో ఎక్కౌంటెంట్. కిటికీ పక్కనే అతని సీటు. చిట్టా-అవర్జాల్లో మునిగి వుండగా ఓ కోయిల కంఠం వినిపించింది... కిటికీ అవతల నుంచి...' 'ఏమండీ!' అంటూ.

"ఆ గొంతు వినేసరికి ఠక్కున లేచింది... అంకెలు చెప్తున్న అతని కలం.

బొడ్లో వున్న సంచిలో నుంచి వంద రూపాయిల నోటు తీసి 'చిల్లర కావాలండీ!' అంటూ అడిగింది ఆవిడ.

నఖశిఖ పర్యంతం ఓ సారి చూసి 'పల్లెటూరి సరుకు... ఏట్ట బాగానే వుంది' అనుకున్నాడు లోలోపల.

'ఏ వూరు మనది?' అడిగేడు ఊరుకోలేక.

'చిల్లర కావాలి!' వచ్చిన పని గుర్తు చేసింది ఆవిడ.

'పొద్దు పనికి వచ్చావా?' మళ్ళీ ప్రశ్న.

'పొట్టగడవొద్దూ... ఏదొక పని... చిల్లర ఇవ్వండి ముందు!' - డిమేండ్ చేస్తున్నట్టు అడిగింది ఆ సారి.

'కాసేపు ఆగి రా... పనిలో వున్నాను' వాయిదా వేయబోయాడు సుందరం.

'అవతల పని వుంది... త్వరగా ఇవ్వండి!' జిడ్డులా పట్టుకొంది ఆవిడ వదలకుండా. ఇదెక్కడ గొడవరా బాబూ అనుకొంటూ బీరువా తీసి చిల్లర ఇచ్చాడు ఆ నోటందుకొని... ఆరుపదులూ... రెండు ఇరవైలూ!

బీరువా మూసి వెనుదిరిగేడో లేదో 'నాకీ నోట్లు వద్దు... ఐదులుంటే ఇవ్వండి... పంచుకోవాలి!'మళ్ళీ డిమెండ్.

'ఉన్నవిచ్చాను... ఇక లేవు!' - అన్నాడు సుందరం సీట్లో కూర్చోబోతూ.

'ఉంటాయి చూడండి... ఐదులివ్వండి!' లాలింపుగా అంది ఆవిడ.

'లేవంటే నీక్కాదూ... ఇక వెళ్లు!' అన్నాడు విసుగ్గా ఆ సారి.

'అలాగైతే ఇవి వద్దు... నా నోటు నాకివ్వండి!' - మళ్ళీ మంకుపట్టు.

'అబ్బబ్బ... వెధవ పీడ'అనుకుంటూ ఆ చిల్లర పొత్తి లాక్కున్నట్టు తీసుకొని వందనోటు ఇచ్చి 'ఇక దయచెయ్!' అన్నాడు కోపంగా.

'అంత కోపం ఎందుకు బాబూ!' అంటూ కిసుక్కున నవ్వింది ఆవిడ. జావ జావ అయ్యాడు సుందరం ఆ నవ్వుకు.

'ఎంత తెల్లని నవ్వు... మల్లెలా... జాబిల్లిలా' - ఆవిడ గేటు దాటే దాకా అటే చూస్తూ మళ్ళీ పనిలో మునిగేడు... హుషారుగా.

ఆ సాయంత్రం క్యాష్ బేలెన్స్ చూసుకొంటే నలభై తగ్గింది... సరిగ్గా నలభై.

'ఎక్కడ పొరపడ్డానా?' అనుకొంటూ గుర్తుకు తెచ్చుకోవటం ప్రారంభించాడు. రెండు ఇరవైలు... ఆవిడకిచ్చిన చిల్లర పొత్తిలోనే తరుగు కనిపించింది. ఒక్కసారి షాక్ తిన్నాడు సుందరం 'ఎంత మోసం.. ఎంత మోసం' అనుకొంటూ. 'అందుకే అంత నవ్వు నవ్వింది'- ఆ నవ్వు పరమార్థం అప్పుడర్థమయిందతనికి.

—మైనేని

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ___________

రచయిత/ రచయిత్రి: ___________

పేజీ నంబరు: ___________